సాక్షి జగిత్యాల

శనివారం । 29 । జూలై । 2023

ఫలించిన ముందస్తు చర్యలు



రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ చూడని భారీ వర్షాలు ఉమ్మడి జిల్లాను అతలాకుతలం చేశాయి. గోదావరి, మానేరు పొంగిపొర్లాయి. వర్షం ఆగినా ఎగువ నుంచి వస్తున్న వరద వచ్చింది వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. ఏడాదిలో దాదాపు 1,200 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని గణాంకాలు చెబుతున్నాయి.

- 8లో ▸

న్యూస్‌రీల్

కనువిందు చేస్తున్న వాటర్‌ఫాల్స్



జాలువారుతున్న నీళ్లు

సారంగాపూర్ (జగిత్యాల): బీర్‌పూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ సమీప పెద్దగుట్ట అటవీప్రాంతంలో వాటర్ ఫాల్స్ కనువిందు చేస్తోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుట్టలపై నుంచి వరద జాలువారుతోంది. దీంతో ఈ దృశ్యం తిలకించేందుకు సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. వర్షాకాలంలోనే ఇలాంటి దృశ్యాలు కనిపిస్తాయని స్థానికులు చెబుతున్నారు.

నృసింహుని దయతో శాంతించిన గోదావరి



పూజలు చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దయతోనే గోదావరి నది శాంతించిందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ఎస్పీ భాస్కర్‌తో కలిసి మంగలిగడ్డ, సంతోషిమాత పుష్కరఘాట్ల వద్ద గోదావరి వరద పరిస్థితిని సమీక్షించారు. తొలుత గంగమ్మతల్లికి పూజలు చేశారు. తీరప్రాంతవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, కమిషనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



రోడ్డుడ్యామ్ పరిశీలిస్తున్న యాస్మిన్ బాషా

జగిత్యాల/జగిత్యాలరూరల్: వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు మరమ్మతు చేయాలని, పునరావాస కార్యక్రమాలు వేగవంతం చేయాలని, పంటలు, ఆస్తి నష్టంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆదేశించారు. అంతటా వరద సహాయక చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ఇప్పటి వరకు 27 మెడికల్‌క్యాంప్‌లు నిర్వహించామని తెలిపారు. వర్షాలతో ప్రాణ, పశునష్టం జరగలేదని వెల్లడించారు. జిల్లాలో 9 సహాయక పునరావాస కేంద్రాల్లో 853 మందికి ఆశ్రయం కల్పించామన్నారు. వరద ధాటికి ధ్వంసమైన రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలని ఆదేశించారు.

ప్యాకేజీ తీసుకు రావాలి



బాధితులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): వర్షాలతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని, కేంద్రప్రభుత్వానికి నివేదిక సమర్పించి ప్రకృతి వైపరీత్యాల ప్యాకేజీ తీసుకురావాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. వర్షబాధితులు, దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వీఆర్వో, వీఆర్‌ఏల వ్యవస్థను తొలగించడం సరికాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వీఆర్‌ఏ, వీఆర్వోలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకుంటామని వెల్లడించారు. బాధితులను ఆదుకునేందుకు కలెక్టర్ యాస్మిన్ బాషా నిధులు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, రవీందర్‌రావు, రమేశ్, మహేందర్‌గౌడ్, ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలక్రైం: జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టినా.. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి వరద ఉధృతి కొనసాగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. గోదావరి నదీ ప్రవాహాన్ని చూసేందుకు, సెల్ఫీలు తీసుకోవడం కోసం అటువైపు వెళ్లే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అటువైపు వెళ్లకూడదని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేస్తే పోలీసు సహాయం అందిస్తుందని తెలిపారు.

ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలి

రోడ్లు ధ్వంసం కావడంతో స్వగ్రామం చేరుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. అనంతరం రోడ్డుడ్యామ్‌నున ఆయన పరిశీలించారు.



కోరుట్ల మండలం కొండికర్లలోని ఓ రైతు పొలంలో వేసిన ఇసుక మేటలు

కన్నీళ్లే మిగిలాయి

- పొలాల్లో ఇసుక మేటలు
- బురదమయంగా నివాసాలు
- ధ్వంసమైన రహదారులు
- కొట్టుకుపోయిన వంతెనలు
- తీవ్రంగా దెబ్బతిన్న పంటలు
- రాకపోకలకు తప్పని తిప్పలు
- భారీవర్షాలు తెచ్చిన తంటాలు



జగిత్యాల గోవిందుపల్లిలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపునీరు

జగిత్యాల/జగిత్యాలఅగ్రికల్చర్/కోరుట్ల/రాయికల్/సారంగాపూర్/మెట్‌పల్లి/ధర్మపురి: నాలుగురోజుల పాటు కురిసిన భారీవర్షాలు జిల్లావాసులకు కన్నీళ్లే మిగిల్చాయి. వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలో బురద చేరింది. నిత్యావసరాలు, వస్తుసామగ్రి వరదలో కొట్టుకుపోయి ప్రజలు కట్టుబట్టలతో మిగిలారు. పునరావాసాలకు తరలివెళ్లి ప్రాణాలు కాపాడుకున్నారు. రోడ్లు ధ్వంసమై రాకపోకలు స్తంభించాయి. వంతెనలు వరద ఉధృతికి కొట్టుకుపోయి బాహ్యప్రపంచంతో గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి.

జిల్లా కేంద్రంలో..

జిల్లా కేంద్రంలోని మోతెవాడ, అరవింద్‌నగర్, చిలుకవాడ, గోవిందుపల్లి, కృష్ణానగర్, ఖిలాగడ్డ, గాంధీనగర్, వెంకటాద్రినగర్, కోరుట్లలోని ఆదర్శనగర్, ప్రకాశంరోడ్డు, గంగంపేటతో పాటు, మెట్‌పల్లిలోని సుల్తానాపూర్ తదితర లోతట్టు ప్రాంతాల్లో వరద ఇళ్లను ముంచెత్తింది. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. శుక్రవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో వరదనీరు తగ్గింది. ఇళ్లలో బురద మిగిలింది. రోడ్లు బురదగా మారాయి. చెత్తాచెదారం పేరుకుపోయింది. కొన్నిచోట్ల విషపురుగులు సంచరించడం, ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ కొట్టుకురావడంతో వాటిని తొలగించడం స్థానికులకు కష్టతరంగా మారింది.

వెంకటాద్రినగర్‌లో..

జగిత్యాలలోని వెంకటాద్రినగర్‌లో సుమారు 470 మంది వరద ప్రభావానికి గురయ్యారు. వారు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. శుక్రవారం వరద ఉధృతి తగ్గినా బురద మిగిలింది.

రంగంలోకి దిగిన అధికారులు..

లోతట్టు ప్రాంతాలు, కాలనీలు, వీధుల్లో వరద, బురద తొలగించే చర్యలకు అధికారులు రంగంలోకి దిగారు. ఆయా ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులు పారిశుధ్య పనులు వేగవంతం చేశారు. తాగునీటి ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చేస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతు చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు సరిచేయడంలో ట్రాన్స్‌కో అధికారులు నిమగ్నమయ్యారు. బాధితులకు సాయం అందిస్తున్నారు.

ధ్వంసమైన రోడ్లు



కొట్టుకుపోయిన లచ్చక్కపేట వంతెన

జగిత్యాలరూరల్: అనంతారం జాతీయ రహదారిపై రోడ్డు డ్యామ్ కొట్టుకుపోయింది. హబ్సీపూర్-అర్పపల్లి, పొరండ్ల- నాగునూర్, జాబితాపూర్-మోతె, కండ్లపల్లి - చెర్లపల్లి మధ్య రహదారులు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. అనంతారం రోడ్డు డ్యామ్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు.

కొట్టుకుపోయిన వంతెన

సారంగాపూర్(జగిత్యాల): లచ్చక్కపేట గ్రామ శివారుల్లోని లచ్చక్కపేట వంతెన వరద ధాటికి శుక్రవారం కొట్టుకుపోయింది. జగిత్యాల - కోనాపూర్ గ్రామాల మధ్య రోడ్డు ఇటీవల కొట్టుకుపోయింది. దీంతో బీర్‌పూర్, సారంగాపూర్ మండలా ప్రజలు లచ్చక్కపేట నుంచి జగిత్యాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇది కూడా కొట్టుకుపోవడంతో రాయికల్ మండలం అల్లీపూర్, కిష్టంపేట గ్రామాల నుంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

శాంతించిన గోదావరి

ధర్మపురి: భారీ వరదలతో ఉగ్రరూపం దాల్చిన గోదావరి నది శుక్రవారం శాంతించింది. అయినా, పట్టణ సమీప తీరంలోగల సంతోషిమాత, గంగమ్మతల్లి, దత్తాత్రేయస్వామి, హన్మాన్ దేవాలయాలు వరదలోనే మునిగి ఉన్నాయి. మంగళిగడ్డ చిరువ్యాపారుల దుఖాణాల్లోకి వరద చేరింది. కడెం ప్రాజెక్టు గేట్లు తెరవడంతో ముప్పు తప్పిందని తీరప్రాంతవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ధర్మపురి సమీపంలోని ఆకసాయిపల్లె గుట్టమలుపు వద్ద లోవెవల్ వంతెన నీట మునగడంతో రెండ్రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. అనంతారం లో లెవల్ వంతెన వద్ద రోడ్డు తెగి రాకపోకలు స్తంభించాయి. ధర్మపురి నుంచి వెళ్లే ఆటోలు, టాటా ఏస్‌లు కల్లెడ- యశ్వంతరావ్‌పేట - గొల్లపెల్లి మీదుగా జగిత్యాలకు చేరుకున్నాయి.



బోర్నపల్లిలో గోదావరి నది

బోర్నపల్లి వద్ద..

రాయికల్(జగిత్యాల): బోర్నపల్లి గ్రామ శివారులోని గోదావరి ఉగ్రరూపం దాల్చింది. కడెం ప్రాజెక్ట్ నీరు విడుదల చేయడంతో గోదావరికి వరద పోటెత్తింది. బోర్నపల్లితో పాటు, నిర్మల్ జిల్లా కడెం మండలం చిన్న బెల్లాల గ్రామం నుంచి పుష్కరఘాట్ వరకు వరదనీరు చేరడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

అస్తవ్యస్తం

రాయికల్(జగిత్యాల): వీరాపూర్ - రామాజీపేట, వీరాపూర్ - రాయికల్, మూటపల్లి - కొత్తపేట, కొత్తపేట - వీవీరావుపేట, భూపతిపూర్ - రామాజీపేట, మైతాపూర్ - కుమ్మరిపల్లి మధ్య రోడ్లన్నీ తెగిపోయాయి. మండలంలో 830 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. ఒక్కబోర్నపల్లిలోనే 95 ఎకరాల్లో పత్తి నీటమునిగినట్లు వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ తెలిపారు. పలు గ్రామాల్లో 15 విద్యుత్ స్తంభాలు, రాయికల్‌లో ఒకటి విరిగిపోయాయి. యుద్ధప్రతిపాదిన సరిచేసినట్లు ట్రాన్స్‌కో ఏడీఈ హరీశ్, ఏఈ అర్జున్ తెలిపారు. రాయికల్‌లో 13 ఇళ్లు పాక్షికంగా కూలిపోయినట్లు తహసీల్దార్ ఖయ్యూం తెలిపారు. బాధితులకు తక్షణ సహాయంగా రూ.3,200 చొప్పున అందించినట్లు పేర్కొన్నారు.



చెత్త తొలగిస్తున్న ట్రాక్టర్

రూ.4లక్షలు నష్టపోయా



వర్షాల ధాటికి 2,500 కోళ్లు చనిపోయినయి. దాణా నీటమునిగింది. సుమారు రూ.4 లక్షల వరకు నష్టపోయా. సర్కారు ఆదుకోవాలె.

– పారిపల్లి భూమన్న, ఫౌల్ట్రీరైతు, రాయికల్

మరమ్మతు చేయాలి



కల్వర్టులపై ఉన్న రోడ్లు వరద ధాటికి కొట్టుకుపోయాయి. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. యుద్ధప్రతిపాదికన మరమ్మతు చేయాలి.

– రాజశేఖర్‌రెడ్డి, కొత్తపేట

11,559 ఎకరాల్లో పంట నష్టం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సుమారు 11,559 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ తెలిపారు. కొడిమ్యాల, మల్యాల మండలాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేశామన్నారు. వరి 9,188 ఎకరాలు, పత్తి 279 ఎకరాలు, కంది 20 ఎకరాలు, సోయాబిన్ 28 ఎకరాలు, మొక్కజొన్న 1864 ఎకరాలు, పసుపు పంట 180 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వివరించారు. సుమారు 8,824 మంది రైతులు వివిధ పంటలు నష్టపోయారని ప్రాథమికంగా నివేదికలు రూపొందించామని చెప్పారు. పూర్తిస్థాయిలో నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి పంపిస్తామని అన్నారు. ప్రధానంగా కొడిమ్యాల, మల్యాల, మల్లాపూర్, కోరుట్ల, కథలాపూర్, మెట్‌పల్లి మండలాల్లో 6 వేల ఎకరాలకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు పేర్కొన్నారు.

అవస్థలు అనేకం..



వర్షపునీటిలో అంగ కళావతి తిప్పలు

కథలాపూర్(వేములవాడ): బీమారం - రంగాపూర్ రోడ్డు కోతకు గురైంది. రాకపోకలు నిలిచిపోయాయి. సిరికొండ - తక్కళ్లపెల్లి రోడ్డు కోతకు గురికాగా.. శుక్రవారం సాయంత్రం వరకూ మరమ్మతు చేయలేని పరిస్థితి. భూషణరావుపేటలో ఇళ్లలోకి వర్షపునీరు చేరి ప్రజలు ఇబ్బందులపాలయ్యారు. డ్రైనేజీలల్లో చెత్త పేరుకుపోయి వర్షపునీరు రోడ్లపై పారింది. శిథిలావస్థలోని ఇళ్లలో ప్రజలు ఉండవద్దని. పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

నీట మునిగిన పొలాలు

మెట్‌పల్లి(కోరుట్ల): మండలంలోని వివిధ గ్రామాల్లో వందలాది ఎకరాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. కొన్ని చోట్ల ఇసుక మేటలు వేశాయి. రంగారావుపేట, కేసీఆర్ తండా, ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామాల్లోని ప్రధాన రహదారులు కోతకు గురయ్యాయి. రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. శుక్రవారం ఎంపీపీ మారు సాయిరెడ్డి అధికారులతో కలిసి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. రాకపోకల పునరుద్ధరణ కోసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

కూలిన ఇళ్లు



అంతర్గాంలో కూలిన ఇల్లు

జగిత్యాలరూరల్: మండలంలో వర్షాలతో ఇప్పటివరకు 12 ఇళ్లు కూలాయి. గురువారం రాత్రి మరో ఐదు ధ్వంసమైనట్లు తహసీల్దార్ నవీన్ తెలిపారు.

పెగడపల్లి(ధర్మపురి): బతికపల్లి గ్రామంలో రెండు ఇళ్లు కూలాయి. బొడ్డు శంకరయ్య, బొడ్డు ప్రశాంత్‌లకు చెందిన ఇళ్లు సర్పంచ్ శోభారాణి తెలిపారు.

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాల్లో రెండు రోజులపాటు కురిసిన వర్షాలకు 40 ఇళ్లకు పాక్షికంగా నష్టం జరిగినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు.



ఇంటి సామగ్రి సర్దుతున్న మహిళ



ఇంటి ఎదుట బురద, కూలినగోడ

గరీబోళ్ల గంగంపేట



సామాన్లు సర్దుకుంటున్న వరద బాధితులు

- విరుచుకుపడ్డ పెద్దవాగు
- వాగుచెంత వంద ఇళ్లు ధ్వంసం
- ఇళ్లు, సామగ్రిని ఊడ్చుకెళ్లిన వరద నీరు
- ప్రాణాలు దక్కించుకుని.. కట్టుబట్టలతో మిగిలిన పల్లెవాసులు



ఇంట్లోంచి బురద తోడేస్తున్న చిన్నారి



బురద తొలగిస్తున్న స్థానికులు

కోరుట్ల: గంగమ్మ ఉగ్రరూపానికి గంగంపేట తుడిచిపెట్టుకుపోయింది. ఒకట్రెండు కాదు.. ఏకంగా వంద ఇళ్లు కూలిపోయాయి. సామగ్రి, నిత్యావసరాలు వరదలో కొట్టుకుపోయాయి. ఇక్కడ ఉండే వాళ్లంతా వీధివ్యాపారాలు.. చిన్నాచితకా పనులు చేసుకునేవారే. భారీవర్షం పడితే.. తెల్లారితే తగ్గుద్దిలే అనుకున్నారు.. కానీ ఎడతెరిపిలేని వానతో గురువారం ఉదయం 9 గంటలకు పెద్దవాగు ఉగ్రరూపం దాల్చింది. వరద ఇళ్లను చుట్టుముట్టింది. ఒక్క గంటలోనే నీటిమట్టం ఆరు అడుగులకు చేరింది. ప్రాణాలు దక్కించుకునేందుకు ప్రజలు తాళ్ల సాయంతో ఇళ్లపైకి చేరుకున్నారు. రాత్రి పునరావాస కేంద్రాల్లో తలదాచుకుని వరద తగ్గాక శుక్రవారం ఇళ్లకు చేరుకున్నారు. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగలలేదు. ఇళ్లలో బురద నిండిపోయింది. ఇంటిల్లిపాది బురద తొలగించడంలో నిమగ్నమయ్యారు. తమను ఆదుకోవాలని కనిపించిన వారికల్లా చేతులు జోడిస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

సాయానికి కదిలారు..

పునరావాస కేంద్రాలకు చేరిన గంగంటపేట, బెండపల్లి, ప్రకాశం రోడ్డు ఏరియాల్లోని సుమారు 70 మందికి రాత్రివేళ భోజనం, బట్టలు, పండ్లు అందించడానికి బీఆర్‌ఎస్ నాయకుడు సంజయ్, అన్నం అనిల్, గడ్డమీద పవన్, ఫయిాం, బీజేపీ నాయకులు సురభి నవీన్, దాసరి శేఖర్, కాంగ్రెస్ నాయకులు కొమిరెడి కరం, చంద్రశేఖర్, సోగ్రాబీ, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు సుజాయిత్, బైతుల్‌మాల్, ఇమ్దాదుల్ యువజన సంఘాలు, జమాతే ఇస్లాం హింద్ సంస్థలు చురుకుగా పనిచేశాయి. ఇళ్ల వద్దకు వెళ్లి బాధితులకు భోజనం అందించారు.



పెద్దవాగు వద్ద తేలిన మంచం



పునరావాస కేంద్రానికి తరలివెళ్తున్న బాధితులు

బియ్యం కొట్టుకుపోయినయి



వరద ధాటికి ఇల్లు కూలింది. బియ్యం సంచీ నీళ్లలో కొట్టుకుపోయింది. సామాన్లు ఎక్కడికి పోయినయో వాగులో వెతుకుతున్నం. మేం ఏం తిని బతకాలో తెలుస్తలేదు.

– నాస్రీన్, గంగంపేట

పిల్లలతో బయటపడ్డ



పొద్దుగాల 9 గంటలకే వాగునీళ్లు ఇళ్లలోకి వచ్చినయి. కాళ్లలోతు నుంచి ఒక్కసారిగా మెడలోతుకు వచ్చినయి. కొందరు తాళ్లు వేసి బయటకు లాగిండ్రు. ఇద్దరు పిల్లలను భుజం మీద ఎక్కించుకుని ప్రాణాలతో బయటపడ్డ.

– సిమ్రాన్, గంగంపేట

నీటిపాలైన పెళ్లి సామాన్లు



రెండు నెలల కింద నా పెళ్లి అయింది. సామాన్లు ఇంకా సర్దుకోలే. మా ఇల్లు వాగునీటిలో మునిగిపోయింది. ప్రాణాలతో ఉంటే చాలని కుటుంబంతో కలిసి పరుగెత్తినం. పొద్దుగాల వచ్చి చూస్తే సామాన్లు కనిపించలే.

– ఇస్మాయిల్, గంగంపేట

కట్టుబట్టలతో పరుగులు



పొద్దుగాల 8 గంటలకు మంచిగనే ఉండే.. ఆ తర్వాత పెద్దవాగు వరద ఉధృతి పెరిగింది. అరగంటలో ఇండ్లకు చేరింది. ఇంటికి తాళం వేసి కట్టుబట్టలతో బయటకు పరుగులు తీసినం. రాత్రి కాల్వగడ్డ స్కూల్ ఉన్నం. పొద్దుగాల వచ్చి చూస్తే.. ఇంట్లో ఏమీ మిగల్లే.

– కలీం, గంగంపేట

ఇలా ఎప్పుడూ చూడలే



పదిహేనేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నం. ఎప్పుడూ ఇంతటి వరద రాలే. ఇండ్లలోకి ఆరు అడుగల వరకు నీళ్లు వచ్చినయి. ఎక్కడ నుంచి వచ్చాయో తెలియదు.. గరీబోళ్ల ఇండ్లను తుడిచిపెట్టుకు పోయినయి.

– అమీర్, గంగంపేట

కొట్టుకుపోయిన కల్వర్టులు



మొగిలిపేటలో ధ్వంసమైన మత్తడి

కోరుట్లరూరల్: మండలంలో వివిధ గ్రామాల్లో 2,500 ఎకరాల్లో వరి, 700 ఎకరాల్లో మొక్కజొన్న, 40 ఎకరాల్లో సోయాబిన్ పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయ అధికారి నాగమణి తెలిపారు. వివిధ గ్రామాల్లో 19 ఇళ్లు కూలినట్టు తహసీల్దార్ రాజేశ్ తెలిపారు. కల్లూర్‌వాగు వంతెన వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ దెబ్బతినటంతో నీటి సరఫరా నిలిపి వేశారు. కల్లూర్, మదాపూర్, సర్పరాజ్‌పూర్, పైడిమడుగు, జోగిన్‌పెల్లి గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడ్డారు. సంగెం పెద్దవాగు సమీపంలోని రైతు అజయేందర్‌రావుకు చెందిన సుమారు రెండెకరాల మామిడితోట కోతకు గురైంది. ధర్మారం, కల్లూర్‌వాగుల్లోని చెక్‌డ్యాంల వద్ద పట్టా భూములు కోతకు గురయ్యాయి. పలుచోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి.

నష్టం అపారం..

మల్లాపూర్(కోరుట్ల): మండలంలో 14.24 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు సహాయ గణాంకాధికారి(ఏఎస్‌వో) శ్రీనివాస తెలిపారు. ఒబులాపూర్, గొర్రెపల్లి గ్రామాల్లో జాతీయ రహదారి ధ్వంసమైంది. రేగుంట శివారులోని పెద్దవాగు బ్రిడ్జిపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనకు ఇరువైపులా రోడ్డు దెబ్బతింది. మల్లాపూర్, చిట్టాపూర్ గ్రామాల్లో చెరువులకు గండి పడింది. రేగుంట, గొర్రెపల్లి, ఒబులాపూర్ గ్రామాల్లో 61వ జాతీయ రహదారి దెబ్బతినడంతో నిర్మల్- జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద్దవాగుకు వరద పోటెత్తింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లోని పునరావాస కేంద్రాలకు తరించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నవీన్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ శివారులోని బైపాస్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే... ధరూర్ గ్రామానికి చెందిన అంతడుపుల నవీన్ (24) మినరల్ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తాడు. శుక్రవారం సాయంత్రం నర్సింగాపూర్‌లో పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి ధరూర్ వస్తుండగా బైపాస్‌రోడ్డులో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో నవీన్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య అఖిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సుధాకర్ తెలిపారు. మృతుడికి నాలుగు నెలల చిన్నారి ఉంది. అందరితో కలివిడిగా ఉండే నవీన్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

గల్ఫ్‌లో గుండెపోటుతో ఒకరు..


కోల రాజం (ఫైల్)

రాయికల్: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కోల రాజం (55) మలేషియాలో గుండెపోటుతో మృతిచెందినట్లు శుక్రవారం కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన కోల రాజం ఉపాధి నిమిత్తం మలేషియాకు వెళ్లాడు. ఇటీవల కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి వారం రోజుల్లో ఇంటికి తిరిగి వస్తానని చెప్పాడు. అక్కడ తోటి స్నేహితులతో కలిసి నిద్రకు ఉపక్రమించగా గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫిట్స్‌తో రైతు..


లక్ష్మీనారాయణ (ఫైల్)

బుగ్గారం: పొలం పనులకని వెళ్లిన ఓ రైతుకు ఫిట్స్ రాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందిన సంఘటన మండలంలోని శెకెల్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బంక లక్ష్మీనారాయణ (45) నాటు వేసేందుకు తన పొలాన్ని దున్నేందుకు ట్రాక్టర్ కిరాయికి మాట్లాడుకుని పొలానికి వెళ్లాడు. పొలం పనులు చేస్తుండగా ఫిట్స్‌తో కుప్పకూలాడు. వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ గమనించి స్థానికులకు సమాచారం ఇవ్వగా వారి సహాయంతో జగిత్యాలలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో లక్ష్మీ నారాయణ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన గుర్రం మహేశ్ (30) అనే యువకుడు ఇరవై రోజుల క్రితం సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఫలించిన ముందస్తు చర్యలు

- ఇప్పటి వరకు సముద్రంలోకి విడుదల చేసిన నీరు
- వరద ఉధృతి నేపథ్యంలో తప్పని విడుదల
- భారీ వరదలనూ తట్టుకునేలా ప్రాజెక్టులు
- ఎల్లంపల్లి, ఎంఎల్‌డీ, మిడ్‌మానేరుకు లక్షల క్యూసెక్కుల వరద
- ఫలించిన ముందస్తు చర్యలు, ఉమ్మడి జిల్లాలో ఒకేమరణం

ఏడాదికాలంలో వదిలిన టీఎంసీలు

ఎల్లంపల్లి	1,182
మిడ్‌మానేరు	56
ఎల్ఎండీ	48.5
మొత్తం	1,286


ఎల్లంపల్లి వద్ద గోదావరి పరవళ్లు

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల వివరాలు

ప్రాజెక్టు	ఎఫ్‌టీఎల్ మీటర్లలో	సామర్థ్యం టీఎంసీలు	నిల్వ టీఎంసీలు	ఇన్‌ఫ్లో/ఔట్ ఫ్లో	తెరిచిన గేట్లు
ఎల్లంపల్లి	145.45/148	20.17	13.46	6,44,871/6,94,482	47
మిడ్‌మానేరు	313.92/318	27.5	18.19	60,667/48514	06
ఎల్ఎండీ	917.40/920	24,03	21.82	33239/56296	16

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ చూడని భారీ వర్షాలు ఉమ్మడి జిల్లాను అతలాకుతలం చేశాయి. గోదావరి, మానేరు పొంగిపొర్లాయి. వాటిపై నిర్మించిన ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. వర్షం ఆగినా ఎగువ నుంచి వస్తున్న వరద వచ్చింది వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. ఏడాదికాలంలో దాదాపు 1200 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ఉన్న మధ్య మానేరు, దిగువ మానేరు, ఎల్లంపల్లి వీటితోపాటు ఎగువమానేరు మరికొన్ని ప్రధాన చెరువుల్లో నీరు నిలువ ఉంటుంది. ఈ నాలుగు ప్రాజెక్టుల్లో కలిపి 51 టీఎంసీల మేరకు నీరు నిలువ ఉంచుకునే వీలుంది. కానీ, రెండేళ్లుగా కురుస్తోన్న భారీ వర్షాలతో పరిమితికి మించి వరద వస్తోంది. రెండేళ్లకాలంలో ఏకంగా లక్షల క్యూసెక్కుల వరద రావడం, అంతే స్థాయిలో విడుదల చేయడం ఏటేటా పెరుగుతోంది.

మన ప్రాజెక్టులు గట్టివి..

ఉమ్మడి జిల్లాలో గురువారం కురిసిన వర్షం కనీవినీ ఎరుగనిది. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామంలో ఏకంగా 38 సెం.మీల వర్షం కురవడం సరికొత్త రికార్డు. సిరిసిల్ల, జగిత్యాల,పెద్దపల్లిలో పల్లెలు చిగురుటాకులా వణికాయి. మంథని, ధర్మపురి, సిరిసిల్ల పట్టణం, జమ్మికుంటలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. ఎగువ, దిగువ మానేరు ప్రాజెక్టులతోపాటు, ఎల్లంపల్లికి భారీగా వరద నీరు వచ్చింది. ముఖ్యంగా కడెం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ, ఎగువన కురిసినవర్షాలతో ఎల్లంపల్లికి వరద పోటెత్తింది. కడెం ప్రాజెక్టు మీదుగా వరద ప్రవహించడంతో మన ప్రాజెక్టులు ఎంతవరద తట్టుకుంటాయి ? అన్న ప్రశ్న అందరిలోనూ మొదలైంది. దీనికి అధికారులు తమ సమాధానంతో భరోసా ఇచ్చారు. ఎల్ఎండీ ప్రాజెక్టుకు 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా.. తట్టుకోగలదని, అదే మిడ్‌మానేరు ప్రాజెక్టు 5.08 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకోగలదని ఎస్సారెస్పీ అధికారులు వెల్లడించారు. మరోవైపు గోదావరి నదిపై నిర్మించిన ఎల్లంపల్లి సామర్థ్యం ఈ రెండు ప్రాజెక్టుల కన్నా అత్యధికం.. ఇది ఏకంగా 19.5 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకుని నిలబడగలదని అధికారులు స్పష్టంచేశారు. ఆ స్థాయిలో వరదలు వచ్చే అవకాశాలు దాదాపుగా లేవని కూడా తెలిపారు. ఏ రకంగా చూసినా.. మన ప్రాజెక్టులు క్షేమంగా నీటితో నిండుకుండలా కళకళలాడుతున్నాయని వివరించారు.

ఒక మరణం.. పంటనష్టం సర్వే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కలెక్టర్లు, సీపీలు,ఎస్పీలు చేపట్టిన ముందు జాగ్రత్త చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయి. కోరుట్లలో బాత్రూం గోడ కూలి వివాహిత మరణం మినహా ఉమ్మడి జిల్లాలో ఎక్కడా మరణాలు, గల్లంతులు చోటుచేసుకోలేదు. మంథనిలో ఇసుక రీచ్‌లో చిక్కుకుపోయిన వారిని పోలీసులు రక్షించిన సంగతి తెలిసిందే. పలు చోట్ల డీఆర్ఎఫ్ టీంలు మోహరించడం, తెగిపోయిన రోడ్ల వద్ద బందోబస్తు పెట్టడంతో చాలా వరకు ప్రాణనష్టం నివారించగలిగారు. వర్షం తెరిపినిచ్చిన దరిమిలా వ్యవసాయ అధికారులు శనివారం నుంచి సర్వే ప్రారంభించనున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు వివరించాలి



కార్యక్రమంలో వ్యవసాయ వర్సిటీ అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ జె.సత్యనారాయణ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాలలో శుక్రవారం అగ్రియూత్ సమ్మిట్ 2023 కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 9 వ్యవసాయ కళాశాలలకు సంబంధించిన విద్యార్థులకు ఉపన్యాస, క్విజ్, బృంద చర్చల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంటలకు గిట్టుబాటు అయ్యేలా విద్యార్థులు ఇప్పటి నుంచే పరిశోధనలు చేయాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ మాట్లాడుతూ రైతులు ఆదాయం పెంచుకునేలా చూడాలన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ గంగాధర్ మాట్లాడుతూ... రైతులకు పెట్టుబడి తగ్గే విధంగా వ్యవసాయ రంగంలో పరిశోధనలు జరగాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఆర్.జగదీశ్వర్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణభట్, పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, ఇఫ్కో, కెనర బ్యాంక్ అధికారులు, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

‘జీవన్‌రెడ్డికి బీసీలపై చిత్తశుద్ధి ఏదీ?’


సమావేశంలో మాట్లాడుతున్న భోగ శ్రావణి

జగిత్యాలటౌన్ : ఎన్నికల నేపథ్యంలో ఓట్లు దండుకోవడమే లక్ష్యంగా బీసీలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పార్టీ జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీని ప్రకటించాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి సవాల్ విసిరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో వదర బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉన్నత వర్గాల్లో వెనుకబడిన రెడ్డి, వెలమ, వైశ్య, బ్రాహ్మణ, ముస్లిం కుటుంబాలున్న సంగతి తెలియదా అని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయంతో ఉన్నత కులాల్లోని ఎంతోమంది పేదలు విద్యా, ఉద్యోగాల్లో లబ్ధిపొందారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న జీవన్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో ఎంతమంది బీసీలకు టికెట్లు ఇస్తారో చెప్పాలన్నారు. కుల, రాజకీయాలతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మరోసారి గెలిచి తన పబ్బం గడుపుకోవాలనుకోవడం సరికాదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు సుంకెట దశరథ రెడ్డి, వీరబత్తిని అనిల్ కుమార్, మదన్‌మోహన్, బాసెట్టి ప్రభాకర్, నలువాల అశోక్ ఉన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దివాకర

పెగడపల్లి(ధర్మపురి): అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ధర్మపురి నియోజకవర్గ ఎన్నికల అధికారి, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ దివాకర సూచించారు. పెగడపల్లిలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. ఏడుమోటలపల్లిలోని కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు కోసం పాఠశాలను పరిశీలించారు. కరెంటు, ర్యాంపు, టాయిలెట్లు, ఇతర ఏర్పాట్లుపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, సదుపాయాలపై వెంటనే నివేదిక అందించాలని ఆదేశించారు. ఓటర్ నమోదు, చేర్పులు, మార్పులపై ప్రత్యేక దృష్టి సారించి బీఎల్వోలకు అప్రమత్తం చేయాలని సూచించారు. పెగడపల్లి, ధర్మపురి తహసీల్దార్లు కృష్ణచైతన్య, వెంకటేశ్, ఆర్ఐలు శ్రీనివాస్, అనిల్, అంగన్‌వాడీ టీచర్ మంగ పాల్గొన్నారు.

గర్భిణులకు బర్త్ వెయిటింగ్ రూములు

- వైద్యశాఖ జిల్లా పోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్



కథలాపూర్(వేములవాడ): వానాకాలంలో సమస్యాత్మక గ్రామాల్లో ఉన్న గర్భిణులకు ఇబ్బందులు ఎదురుకాకుండా జిల్లాలో బర్త్ వెయిటింగ్ రూములు ఏర్పాటు చేసినట్లు వైద్యశాఖ జిల్లా పోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతీ పునరావాస కేంద్రంలో వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచి వైద్యం అందేలా ఏర్పాట్లు చేశామన్నారు. గర్భిణులు ప్రసవం కోసం ఇబ్బందులు పడకుండా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురిలో బర్త్ వెయిటింగ్ రూములను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ భూషణ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఇబ్రహీంపట్నం : భారీ వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తెలంగాణ జన సమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గోదావరి పరిస్థితిని ఎర్దండి వద్ద పరిశీలించారు. గ్రామాల్లో చిన్నపాటి వర్షం కురిసినా డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ముంపునకు గురికావాల్సి వస్తోందన్నారుఉ. వరద ముంపు పునరావృతంగా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ టీజేఎస్ నాయకుడు కంతి మోసె ఆనంద్, బాసెట్టి గంగారెడ్డి, గూడ రాజిరెడ్డి, రెబ్బటి మల్లయ్య, నంద గోపాల్, దాసరి గంగ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్డాం పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న భోగ శ్రావణి

జగిత్యాల రూరల్: జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామ శివారులో జాతీయ రహదారిపై భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డాంను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి పరిశీలించారు. ఈ సందర్భంగా మరమ్మతు పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎన్‌హెచ్ హైవే ఏఈ అమీర్‌పాషా, తదితరులున్నారు.

వరద బాధితులకు వసతులు


పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలు ప్రస్తుతం పునారావస కేంద్రాల్లో తలదాచుకుంటున్నాయని, వారికి అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ లత సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు పునరావాస కేంద్రాలను సందర్శించారు. ప్రతీఒక్కరి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నవారు. మరోవైపు..అరవింద్‌నగర్‌కు చెందిన గర్భిణి రక్షితను డాక్టర్ పరీక్షించారు. అనంతరం 108 వాహనం ద్వారా మాతా శిశు సంక్షేమ కేంద్రానికి తరలించారు. ఆమె వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

కార్మికుల ఆరోగ్యంపై దృష్టి


కార్మికులకు రెయిన్ కోట్స్ అందజేస్తున్న చైర్మన్

జగిత్యాల: కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ సూచించారు. వర్షాల నుంచి రక్షణ కోసం కార్మికులకు ఆయన శుక్రవారం రెయిన్‌కోర్ట్స్ అందజేశారు. ప్రస్తుతం అధికంగా వర్షాలు కురుస్తున్నందున కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: పట్టణంలో సొంత ఇళ్లులేని పేదలు డబుల్‌బెడ్‌రూం ఇళ్లకోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. ఆగస్టు 5వ తేదీ వరకు మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయం, కులం సర్టిఫికెట్లు జతచేయాలని పేర్కొన్నారు. జగిత్యాలలో నివాసం ఉండేవారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదన్నారు.

సఖి కేంద్రం సేవలు వినియోగించుకోవాలి

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: సఖి సెంటర్ సేవలు వినియోగించుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం వన్‌స్టాప్ సఖీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళలకు ప్రతి సమస్య కౌన్సిల్ ద్వారా పరిష్కారం చూపేందుకు సఖీ కేంద్రం దోహదపడుతుందన్నారు. దీనిపై గ్రామీణ ప్రాంత మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. సామాజిక బాధ్యతతో సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, మహిళలకు రక్షణ కల్పించేందుకు ఉపయోగపడుతుందని, బాధిత మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ లత, ఎస్పీ భాస్కర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ లత, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, కమిషనర్ నరేశ్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాస్, సఖీ సీఈవో జయశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

సేదతీరిన మంత్రి

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని పలు ప్రారంభోత్సవాలు చేసి ధర్మపురి నియోజకవర్గానికి వెళ్తుండగా మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామ శివారులో రోడ్డుపై ఆగారు. మక్కజొన్న కంకులు విక్రయిస్తున్న మహిళ వద్ద కంకులు కొని సేద తీరారు.

గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయం

ధర్మపురి : గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయమని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని దమ్మన్నపేట నుంచి దొంతాపూర్ వరకు రూ.30 కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులతో నిర్మించే బీటీరోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రోడ్ల అభివృద్ధికి బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, రైతుబంధు సమితి సభ్యుడు భీమన్న, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులున్నారు.

హత్యకేసులో తండ్రీ కొడుకుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్

మల్యాల(చొప్పదండి): హత్యకేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కోటేశ్వర్ తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం హత్య కేసు వివరాలను సీఐ వెల్లడించారు. మండలంలోని మద్దుట్ల గ్రామానికి చెందిన అన్నదమ్ములు బర్ల చిన్నమల్లయ్య, బర్ల ఎర్రయ్య మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతుంది. ఈనెల 26న వరదనీటిని ఒర్రెలోకి మళ్లించే క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో బర్ల ఎర్రయ్య, కుమారుడు గంగారెడ్డి సమీపంలో గుడిసెలో ఉన్న గొడ్డలితో చిన్న మల్లయ్యపై దాడిచేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితులు బర్ల గంగారెడ్డి, బర్ల ఎర్రయ్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ కోటేశ్వర్ తెలిపారు. ఎస్సై అశోక్, హెడ్ కానిస్టేబుల్ పాషా, కానిస్టేబుల్ రాజేందర్ పాల్గొన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న ఎస్పీ


పూజల్లో పాల్గొన్న ఎస్పీ భాస్కర్

ధర్మపురి : ధర్మపురి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం జిల్లా ఎస్పీ భాస్కర్ స్వామివార్లను దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న స్వామివారి శేషవస్త్రం కప్పి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటస్వామి, సీఐ రమణమూర్తి, ఎస్సై దత్తాత్రి, వేద పండితులు ముత్యాల శర్మ, దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు నంబి శ్రీనివాస చారి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నంబి నర్సింహమూర్తి, కమిటీ సభ్యులు తదితరులున్నారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం



జగిత్యాలరూరల్: మతసామరస్యానికి ప్రతీక మొహర్రం అని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం చల్‌గల్‌లో జరిగిన మొహర్రం వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. కుల, మతాలకతీతంగా వేడుక జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్ల గంగనర్సు పాల్గొన్నారు.



గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. రైతుల పంటపొలాలు నీట మునగగా వరద ప్రవాహంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం వర్షాలు కొంచెం తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.